TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :80 శనివారం 20 జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad



04



04

## విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్

- అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ
- వివిధ ప్రాంతాల నుంచి 15వేలమంది విద్యార్థుల హాజరు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనుల, ప్రారంభోత్సవాలు

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ. 50.73కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం చుట్టారు.




02

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ
- రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):




తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది.

## రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం

- నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల
- 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి
- లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు

అమరావతి,జూన్19( హైదరాబాద్ మిర్రర్):



రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఎపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.



## ఎస్‌హెచ్‌జీలు, పీఏసీఎస్‌ల పాత్ర యథాతథం

02

- 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోలు
- ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు
- ప్రస్తుత కొనుగోలు వ్యవస్థ కొనసాగుతుంది.
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిది ద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

## పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

- నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు
- తెలంగాణలో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు
- ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత
- విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

02



హైదరాబాద్,జూన్19 ( హైదరాబాద్ మిర్రర్):

దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు.

## నాణ్యమైన యంత్రాలను సమకూర్చాలి

- సింగరేణి సమస్యలు పరిష్కరించాలి
- బాయిబాట కార్యక్రమానికి శ్రీధర్ బాబు ఆటంకాలు
- టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

పెద్దపల్లి,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

'బాయి బాట' కార్యక్రమం చేపడితే రాజకీయంగా తమను అడ్డుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను ఏర్పాటు చేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఎంత అడ్డుకుంటే అంత బలంగా ముందుకు సాగుతామన్నారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కవిత సందర్శించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ఉద్యోగులకు సౌకర్యాలు, సరైన యంత్రాలు, పనిముట్లు ఏర్పాటు చేయాలని కోరారు.సింగరేణి కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో క్వాలిటీ యంత్రాలు లేవు.. వారి భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత అన్నారు.



02



## హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం

- మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్
- జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷- పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది.

## భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):



భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

02

మొదటిపేజీ తరువాయి

# నాణ్యమైన యంత్రాలను సమకూర్చాలి

## సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

### బాయిబాట కార్యక్రమానికి శ్రీధర్ బాబు ఆటంకాలు

### టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

**పెద్దపల్లి,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

'బాయి బాట' కార్యక్రమం చేపడితే రాజకీయంగా తమను అడ్డుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను ఏర్పాటు చేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఎంత అడ్డుకుంటే అంత బలంగా ముందుకు సాగుతామన్నారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కవిత సందర్శించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ఉద్యోగులకు సౌకర్యాలు, సరైన యంత్రాలు, పనిముట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో క్వాలిటీ యంత్రాలు లేవు.. వారి భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు, స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని ఎండగడుతూ ఆమె వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావుపై ఆమె చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సింగరేణి కార్మికుల క్షేమమే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన కవిత.. ప్రస్తుతం సింగరేణిలో కార్మికులకు కనీస నాణ్యత కలిగిన యంత్రాలు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసే బొగ్గు గని కార్మికుల భద్రతను ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావే కాపాడుతున్నారు సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. తాము సింగరేణి ప్రాంతాల్లో పర్యటిస్తుంటే మంత్రి శ్రీధర్ బాబు కావాలనే తమ పర్యటనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకుంటూ, ఈ వ్యవహారం ద్వారా శ్రీధర్ బాబు రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

మొదటిపేజీ తరువాయి

# మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ

### రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత

### అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం

### కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఎస్‌హెచ్‌జీలు, పీఏసీఎస్‌ల

# పాత్ర యథాతథం

రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.'తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఇకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం' అని మంత్రి తెలిపారు. పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షించడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం పక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు. ÷-రస్తుతం కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. ల్గ÷ల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు.'ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

### నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు

### తెలంగాణలో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

### ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

### విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత

### విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ

### ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్

అందులో రూ.36.65కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. రూ.14.08కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమిలను రేవంత్ ప్రారంభించారు. రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు. రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్. రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమి ప్రారంభం చేశారు. రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమి ప్రారంభించారు. రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమి ప్రారంభం అయ్యింది. రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమి ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమి ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమి ప్రారంభం అయ్యింది. రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమి ప్రారంభం చేశారు. రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమి ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు గురుకుల విద్యార్థులకు 22 రకాల వస్తువులు, హాస్టల్ విద్యార్థులకు 10, డే స్కాలర్లకు 7 రకాల విద్యా సామగ్రితో కిట్లను అందించారు. ఈ కార్యక్రమానికి సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ చారిత్రాత్మక వేడుకకు రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), ప్రభుత్వ గురుకులాలు, విద్యా వసతి గృహాల నుంచి దాదాపు 15 వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల రకాన్ని బట్టి వారి అవసరాలకు తగినట్లుగా ఈ కిట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా డిజైన్ చేసింది.

మొదటిపేజీ తరువాయి

# హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం

### మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్

### జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷- పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఉఊఓఅ) ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది.ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# 88 అంధ విద్యార్థుల మధ్య 61వ పెళ్లి రోజు జరుపుకున్న మురళీమోహన్.

### ఈ రోజు ప్రముఖ నటులు , నిర్మాత మురళీమోహన్ తన 61 వ వివాహ వార్షికోత్సవాన్ని

హైదరాబాద్ బేగంపేటలోని "దేవనార్ బ్లైండ్ స్కూల్ "లో అంద విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. తన మరియు తన కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలను లేదా వివాహ వార్షికోత్సవాలను దేవనార్ బ్లైండ్ స్కూల్లో అంధ విద్యార్థుల మధ్య జరుపుకునే ఆనవాయితీని ప్రతి సంవత్సరము పాటిస్తుంటారు మురళీమోహన్. ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ రోజు దేవనార్ బ్లైండ్ స్కూల్లోని అంధ విద్యార్థుల సమక్షంలో తన 61వ వివాహ దిన మహోత్సవాన్ని జరుపుకున్నారు మురళీమోహన్. ఈ సందర్భంగా స్కూలులో జరిగిన సభా కార్యక్రమంలో మురళీమోహన్ తో పాటు ప్రముఖ గాయకుడు - సంగీత దర్శకుడు - భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధర శాస్త్రి, దేవనార్ బ్లైండ్ స్కూల్ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆయన సతీమణి జ్యోతి గౌడ్, మురళీమోహన్ సన్నిహిత మిత్రులు బిఎస్ రావు, ప్రముఖ ఫిలిం జర్నలిస్టు ప్రభు పాల్గొన్నారు. ముందుగా దేవనార్ బ్లైండ్ స్కూల్ చైర్మన్ సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ "మురళీమోహన్ గారి వంటి పెద్దలు, సహృదయులు ప్రతి సంవత్సరము తన మరియు తన కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలను మా బ్లైండ్ స్కూల్ లోనే జరుపుకోవటం నాకు చాలా ఆనందాన్నిస్తుంది. ఆయన ఈ రోజు మా బ్లైండ్ స్కూల్లోని 600 మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్,మధ్యాహ్నం లంచ్ నైట్ డిన్నర్ కు అవసరమైన మొత్తాన్ని అందజేశారు.అంతే కాకుండా బ్లైండ్ స్టూడెంట్స్ కు అత్యావశ్యకమైన బ్రెయిలీ లిపి పేపర్ బండిల్స్ ను కూడా బహుకరించారు. ఇలాంటి సహృదయులు నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలి" అన్నారు. భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధర్ శాస్త్రి మాట్లాడుతూ "మురళీమోహన్ గారు తన 61వ వివాహ మహోత్సవ దినాన్నే కాకుండా ఆయన ఇంట్లో జరిగే ప్రతి శుభ కార్యాన్ని ఇక్కడే.. ఈ బ్లైండ్ స్కూల్లోనేజరుపుకోవటం ఆయన సహృదయతకు నిదర్శనం. ఈ స్కూల్ చైర్మన్ సాయిబాబా గౌడ్ గారు ముప్పై సంవత్సరాల క్రితం చిన్న స్థాయిలో రెండు గదుల్లో ఈ దేవనార్ బ్లైండ్ స్కూల్ ను ప్రారంభించి ఇప్పుడు దీన్ని ఒక విశ్వవిద్యాలయ స్థాయికి తీసుకువెళ్లటం అభినందనీయం. వారి కృషి , పట్టుదల వల్ల ఈ స్కూల్ జాతీయస్థాయిలో గుర్తింపు పొంది అనేక అవార్డులను కూడా సొంతం చేసుకుంది . ఈ కార్యక్రమ ప్రారంభంలో విద్యార్థులు భగవద్గీతలోని కొన్ని శ్లోకాలను ఆలపించడం నన్ను నిజంగా కదిలించి వేసింది . మన జీవ నదిగా ..మన హైందవ జీవన విధానంలో భాగమైన భగవద్గీతను మనకంటే ఎక్కువగా అమెరికా జర్మనీ ,జపాన్ వంటి విదేశాల వారే ఎక్కువగా ఆలపిస్తున్నారు.. అనుసరిస్తున్నారు. కానీ మనదేశంలో పుట్టిన భగవద్గీత గీతకు,మన కృష్ణుడు బోధించిన భగవద్గీతకు మనదేశంలోనే తగినంత ఆదరణ లభించకపోవడం దురదృష్టకరం . ఈ పరిస్థితి మారి ప్రతి హిందువు హైందవ ధర్మ పరిరక్షణలో భాగమైన భగవద్గీతను చదవాలి..చదివించాలి...అన్నారు . మురళీ మోహన్ మాట్లాడుతూ " నేను ప్రతి సంవత్సరం నా బర్త్ డే.. మ్యారేజ్ డే వేడుకలను ఇక్కడే జరుపుకుంటాను. వచ్చిన ప్రతిసారి ఈ స్కూల్ మరింత విస్తృతం అవ్వటాన్నీ గమనించాను.

# మాజీ డిప్యూటీ మేయర్ శనిగల ధనరాజ్ యాదవ్ దంపతులకు ఘనంగా వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**హైదరాబాద్ మిర్రర్, జూన్ 19:**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్, మాజీ కార్పొరేటర్ శనిగల ధనరాజ్ యాదవ్ - ప్రణయ్ ధనరాజ్ యాదవ్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు, ఉద్యమకారులు ఆయన నివాసానికి తరలివచ్చి హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ?ధనరాజ్ యాదవ్ దంపతులను శుభాకాంక్షలు తెలిపిన వారిలో నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాంబశివారెడ్డి, కేసిఆర్ వీరాభిమాన సంఘం అధ్యక్షులు మరియు ప్రముఖ తెలంగాణ ఉద్యమకారులు జలగం చంద్రయ్య, బిక్షపతి, కుమార్ రెడ్డి, శివ, ఆంజనేయులు ఉన్నారు. వీరితో పాటు బాచుపల్లి డబల్ బెడ్ రూమ్ కమిటీ అధ్యక్షులు సలీం భాయ్, అహ్మద్ భాయ్‌లతో పాటు లలిత రెడ్డి, భారతి, యశోద, షాలిన్ శర్మ తదితర మహిళా నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి దంపతులకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.



# కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం వెళ్లే దారిలో చెత్త పర్వతాలు

## జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అవస్థలు



**కుత్బుల్లాపూర్, జూన్ 19 (హైదరాబాద్ మిర్రర్) :**

ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రంగా ఉండాల్సిన మున్సిపల్ కార్యాలయం వెళ్లే రోడ్డే చెత్త కుప్పలతో నిండిపోయింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ ఆఫీస్ రోడ్డుపై గత కొన్ని రోజులుగా జిహెచ్ఎంసి అధికారులు చెత్తను ఎత్తకపోవడంతో రోడ్డు ఇరువైపులా వ్యర్థాల గుట్టలు ఏర్పడ్డాయి. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన మున్సిపల్ కార్యాలయం వద్దే జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మున్సిపల్ ఆఫీస్ రోడ్డు పక్కన ఉన్న నాలా/కాలువ వద్ద గత చెత్తను ఎత్తకపోవడం జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్షమే దుర్వాసన ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలిని దేశ ప్రజల ఆకాంక్ష..పాపిరెడ్డి నగర్ అధ్యక్షులు చంద్రారెడ్డి

**కూకట్ పల్లి, జూన్ 19 (హైదరాబాద్ మిర్రర్) :**

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడాలన్నా భారత దేశ ప్రజల ఆకాంక్ష త్వరలో నెరవేర బోతుందని పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్ల చంద్ర రెడ్డి కార్యాలయంలో కేకును కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు జీ. బి. కన్నారావు, వనం ఆంజనేయులు, పద్మ కేశవులు, కె.యాదగిరి ,దాకూరి తిరుపతిరెడ్డి, పండు గౌడ్, లక్ష్మణ్, జగన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో మాతృశ్రీ ప్రభంజనం

**చౌటుప్పల్, జూన్ 19(హైదరాబాద్ మిర్రర్ ):**

మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ రెండవ,నాల్గవ,ఆరవ సెమిస్టర్ ఫలితాలలో చౌటుప్పల్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మాతృశ్రీ డిగ్రీ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థిని బొమ్మకంటి శ్రావణి ( బిఎస్సి - ఎంపీసీ ఎస్ - ) 9.88/10 స్గపా కెళ్ళ రుచిత బిఎస్సి ఎంపీసీ 9.88/10 ఎస్జిపిఏ సాధించగా...మరో 15 మంది పైగా విద్యార్థులు 9.0 కంటే ఎక్కువ ఎస్జిపిఏ సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారు.ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు ప్రణాళికతో చదువుతూ..లక్ష్య సాధనకై నిత్యం కృషి చెయ్యాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు




# పసికందులకు రూ.20 వేల ఫిక్స్డ్ డిపాజిట్‌లు చేసిన నీలం మధు

## రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

## జీహెచ్ఎంసీ కార్మికులకు నిత్యావసర కిట్లు పంపిణీ



**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 19:**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ముత్తంగి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు.ఈ సందర్భంగా పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన పసికందుల భవిష్యత్తు కోసం తలా రూ.20 వేల చొప్పున ఫిక్స్డ్ డిపాజిట్ చెక్కులను అందజేస్తామని నీలం మధు ముదిరాజ్ ప్రకటించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం విశేషం. నిరుపేద కుటుంబాలకు ఇది ఆర్థిక భరోసాగా నిలుస్తుందని ఆయన తెలిపారు.అలాగే పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న జీహెచ్ఎంసీ సఫాయి కార్మికులను సన్మానించి, వారి కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. సమాజ సేవలో భాగస్వాములవుతున్న కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నీలం మధు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశంలో ప్రేమ, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఆయన చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా రాహుల్ గాంధీకి నిజమైన జన్మదిన కానుక అందిస్తున్నామని చెప్పారు.రాబోయే రోజుల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నీలం మధు ముదిరాజ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, సంగన్నగారి గోపాల్, నరసింహ రెడ్డి, వెంకటేష్ నాయక్, రాఘవేంద్ర, నారాయణదాసు, సంపత్ రెడ్డి, మణికంఠ, సందీప్ గౌడ్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కోల్కూరి నరసింహారెడ్డి, అశోక్ ముదిరాజ్, మధు పంతులు, గడ్డ యాదయ్య, గుండ్ల మహేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, గోపాలకృష్ణ, సందీప్ యాదవ్, దశరథ్, ప్రవీణ్, విఠల్, రంజిత్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సికిల్ సెల్ నిర్మూలనకు అవగాహనే ఆయుధం

## వంశపారపర్య పరీక్షలపై జిల్లా వ్యాప్తంగా చైతన్య ర్యాలీలు




**మంచిర్యాల, జూన్ 19 (హైదరాబాద్ మిర్రర్)**

ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సికిల్ సెల్ వంశపారపర్య పరీక్షలపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, సికిల్ సెల్ - తలసేమియా బాధితుల సంక్షేమ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సికిల్ సెల్ వ్యాధి ఒక వంశపారపర్య రక్త సంబంధిత వ్యాధి అని, ముందస్తు పరీక్షలు, అవగాహన ద్వారా దీనిని నియంత్రించవచ్చని వైద్యులు తెలిపారు. ముఖ్యంగా వివాహానికి ముందు సికిల్ సెల్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలను ఈ వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చని సూచించారు.తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సికిల్ సెల్, తలసేమియా వంటి జన్యుపరమైన వ్యాధులపై సమాజంలో విస్తృత అవగాహన అవసరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చుంచు శంకర వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి అవినాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొజ్జ వెంకటయ్య, జాయింట్ సెక్రటరీ పెరుగు పోశం, కార్యవర్గ సభ్యులు పెరుగు సుమలత, వెంకటస్వామి, అక్కపెల్లి లక్ష్మి, గాండ్ల స్వాతి, దుర్గం ప్రవీణ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, నామదేవ్, కాకినాడ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పుట్ట సత్తయ్యతో పాటు పలువురు వైద్యులు,వైద్య సిబ్బంది హాజరయ్యారు.సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అధికారులు తెలిపారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు: విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

## షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ సేవా కార్యక్రమం





**కూకట్ పల్లి, జూన్ 19 (హైదరాబాద్ మిర్రర్) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, నోట్‌బుక్స్, పుస్తకాలు, ఎడ్యుకేషన్ కిట్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గోల్ల జాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేస్తూ, వారి భవిష్యత్తు నిర్మాణంలో తోడ్పడటమే తమ లక్ష్యమని గోల్ల జాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థుల అభ్యున్నతే మా ప్రధాన లక్ష్యం. వారి విద్యా ప్రయాణంలో తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏవైనా సరే ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాం. విద్యకు సంబంధించిన అవసరాల విషయంలో మా సహకారం నిరంతరం కొనసాగుతుంది" అని అన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జాతీయ సమన్వయకర్త మన్నె జీవన్, మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా నాయకులు ఎం. సాయి కిరణ్, అనూప్ యూనియల్, సాద్విక్ తదితరులు పాల్గొని విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, విద్యా రంగంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోల్ల జాన్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంచుతాయని వారు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవా కార్యక్రమంగా నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ ముందుకు రావడం విశేషంగా నిలిచింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# అమీన్‌పూర్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 19:**

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజల సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజాక్షేత్రంలోనూ ధైర్యంగా ప్రస్తావిస్తున్నారని కొనియాడారు. ప్రజల సంక్షేమం, రైతులు, యువత, మహిళలు, పేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ ప్రతినిధులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



# ఘనంగా భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 19(హైదరాబాద్ మిర్రర్ ):**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో భావిభారత ప్రధాని 56వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ, నారాయణపురం మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, వార్డు సభ్యులు సురపల్లి వెంకటేష్, బల్గురీ శివ సాగర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ రమేష్ బాబు, చిలుకూరి శ్రీనివాస్, గునిగంటి రాజు గౌడ్,రేవనపల్లి గోపాల్,బద్దుల యాదగిరి యాదవ్, మారగోని శంకర్ గౌడ్, సుర్వి శంకర్ గౌడ్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, వలిగొండ మాధవులు, వడ్డేపల్లి శివప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు బానోతు కిరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు



# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఓ గొప్ప వరం

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూన్ 19 (హైదరాబాద్ మిర్రర్):**

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు గొప్ప వరం అని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సాయిబాబా నగర్ మరియు బాచుపల్లి ప్రాంతాలకు చెందిన అంబుగోల ప్రసాద్ గారు, మేకల రుద్రమదేవి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించారు. వెంటనే స్పందించిన హనుమంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో బాధితులకు వైద్య చికిత్స మరియు శస్త్రచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్ -- ఎల్ ఓ సి) ద్వారా రూ.6,00,000/- (ఆరు లక్షల రూపాయలు) మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంజూరైన సీఎం ఆర్ఎఫ్ -- ఎల్ ఓ సి పత్రాలను కొలన్ హన్మంత్ రెడ్డి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి జీవితాల్లో ఆశను నింపుతోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# విద్యుత్‌నగర్ కాలనీ నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 19:**



భారతీనగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారం కోసం మాజీ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి సెరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కలిసి సమస్యలను వివరించారు. కాలనీ గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఉండి ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో, బోర్‌వాటర్ మరియు మంజీరా నీటి సరఫరా వ్యవస్థలను హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అమీన్‌పూర్ సర్కిల్‌కు అప్పగించి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్‌తో సమన్వయం చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా భారతీనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జోనల్ కమిషనర్‌తో చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.

# మహాలక్ష్మి కాలనీలో డీసీ పర్యటన

**ఇబ్రహీంపట్నం, జూన్ 19 హైదరాబాద్ మిర్రర్**

సాహెబ్‌నగర్ డివిజన్‌లో హయత్‌నగర్ డీసీ అజ్మీరాస్వామి పర్యటించారు. సాహెబ్‌నగర్ డివిజన్, పీవీఆర్ కాలనీ కల్వర్ట్ దిగువన వరదకు గురవుతున్న మహాలక్ష్మి కాలనీని సందర్శించారు. కాలనీలో వాసులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి త్వరితగితిన చర్యలు తీసుకోవాలని డీసీని స్థానికులు కోరారు. పీవీఆర్ కాలనీ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని డీసీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విద్యారెడ్డి, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా వేధిస్తున్న ఆలయ అధికారులు

## ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టిన వ్యక్తి

**వేములవాడ,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులపై కొండ్లెపు ముత్యం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బిగితే కు శు క్రవారం ఫిర్యాదు చేశారు. మోచి కులం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న తను వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయం ఎదురుగా కొబ్బరికాయలు, స్వామి వారి ఫొటోలతో కూడిన దుకాణం నడుపుతూ జీవనోపాధి పొందుతున్నానని తెలిపారు. పురపాలక సంఘం రహదారిపై దుకాణం పెట్టావని, దీనిని వెంటనే తీసివేయాలని మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 20 రోజులుగా తనను వేధిస్తుండగా తన దుకాణంలోకి ఏఈఓలు శ్రవణ్ కుమార్, జయ కుమారి, పర్యవేక్షకులు నూగూరి నరేందర్, గడ్డం రాజేందర్, ఏఈ రామ్ కిషన్ రావు, భగవంత రావు, భరత్, గంగిశెట్టి సాయి, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది దుకాణంలోకి చొరబడి కులం పేరుతో దూషించి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులు పేర్కొన్నారు. కులం పేరుతో దూషించి తనను బెదిరించిన వారిపై ఈవో రమాదేవితో పాటు ఆలయ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు పేర్కొన్నారు.

# సంగారెడ్డి లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## 350 మంది చిన్నారులకు సైకిళ్ల పంపిణీ..

## 200 కేజీల భారీ కేక్ కట్ చేసిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 19:**



లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేయడంతో పాటు 200 కేజీల భారీ కేక్‌ను చిన్నారులతో కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాకు బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఎన్‌డీఆర్ఎఫ్, ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ వంటి కీలక కేంద్ర సంస్థలను కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తోందని విమర్శించారు.దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ కుటుంబం చేసిన సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. రాహుల్ గాంధీ తల్లి, తండ్రి, తాత, నానమ్మ, ముత్తాత దేశం కోసం చేసిన సేవల గురించి తాను వివరించగలనని, అదే విధంగా గత 12 ఏళ్ల మోదీ పాలనలో సాధించిన అభివృద్ధిపై బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ, యువతకు కోట్లాది ఉద్యోగాలు బాకీ ఉన్నారని ఆరోపించారు. బీజేపీ నేతలు ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని, దేశ ప్రజలు, ఉమ్మడి రాష్ట్ర ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, చిన్నారులు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



# శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

## మాజీ ఎంపీపీ గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం,జూన్ 19(హైదరాబాద్ మిర్రర్):**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి , మాజీ ఎంపీపీ గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి కళ్యాణ మహోత్సవానికి హాజరై శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మతల్లి దీవెనలను పొంది. అనంతరం అన్నప్రసాధన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఉప్పరగొని యాదయ్య, మాజీ అధ్యక్షుడు నిమ్మల నాగేష్ ముదిరాజ్ సంఘం కమిటీ సభ్యులు,వార్డు సభ్యులు సూరపెల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, బల్గూరి శివ, పట్నం బాలకృష్ణ గౌడ్, సింగం బిక్షపతి, కట్ల వనజ భాస్కరాచారి, నీళ్ల అనిత శంకర్ ముదిరాజ్, చింతల శైలజ సత్యనారాయణ ముదిరాజ్, చిలువేరు రమాదేవి శంకర్, సింగపంగా ప్రశాంతి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ రమేష్ బాబు, గునిగంటి రాజు గౌడ్, బద్దుల యాదగిరి యాదవ్,మారగోని శంకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, విలేకర్ సింగం కృష్ణ,రేవనపల్లీ గోపాల్,వడపల్లి శివ ప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు బానోతు కిరణ్ నాయక్ , ముదిరాజ్ సంఘం కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# ఖైతలాపూర్‌లో దుర్గామాత పుట్ట గుడి ధ్వంసం

## నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి

## ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

**కూకట్ పల్లి, జూన్ 19 (క్రైమ్ మిర్రర్) :**

ఖైతలాపూర్ గ్రౌండ్స్‌లోని సర్వే నంబర్ 911లో గత నాలుగు తరాలుగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న దుర్గామాత పుట్ట గుడిని గుర్తుతెలియని వ్యక్తుల చేత ధ్వంసానికి గురైనట్లు సమాచారం అందడంతో, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖైతలాపూర్ గ్రామ ప్రజలు ఈ దేవాలయాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తూ ఎన్నో సంవత్సరాలుగా పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాది బోనాల పండుగను ఈ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడంతో పాటు, ఇతర దేవాలయాల్లో జరిగే కళ్యాణోత్సవాల కోసం కూడా ఇక్కడి దుర్గామాత పుట్ట గుడి మట్టిని తీసుకెళ్లే సంప్రదాయం కొనసాగుతోందని పేర్కొన్నారు. అలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిన్న రాత్రి ధ్వంసం చేసినట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని ఆయన అన్నారు. గుడి పరిసర ప్రాంతంలో వాహనం సంచరించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, కారుతో గుడి చుట్టూ పలుమార్లు తిరుగుతూ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఘటనపై సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించగా, వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టినట్లు మహేందర్ వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులైన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసే ఇటువంటి చర్యలను ప్రభుత్వం, పోలీసులు అత్యంత సీరియస్‌గా పరిగణించాలని కోరారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక హిందూ సమాజ ప్రతినిధులు, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఐలయ్య, పిల్లి మధుసూదన్, కృష్ణ యాదవ్, ధనరాజు, రాము, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బైండ్ల రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# శరద్ పవార్ ఎన్‌సీపీలో మళ్లీ చీలిక?

**న్యూఢిల్లీ: హైదరాబాద్ మిర్రర్**

ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(యూబీటీ)లో చీలిక అనివార్యమని ఊహాగానాలు సాగుతున్న వేళ శరద్ పవార్ సారథ్యంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ-ఎస్‌పీ)లో మరోసారి తిరుగుబాటు జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్‌సీపీ(ఎస్‌పీ)కి చెందిన పలువురు ఎంపీలు అజిత్ పవార్ వర్గంతో మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం. దీంతో మహారాష్ట్రలో మరో భారీ రాజకీయ పునరేకీకరణ జరగవచ్చన్న ఊహాగానాలు జోరందుకున్నాయి.అజిత్ వర్గంతో కొంద రు ఎంపీలు, ఎమ్మెల్యేలు చర్చలు జరుపుతున్నమాట వాస్తవమేనని ఎన్‌సీపీ(ఎస్‌పీ)కి చెందిన పలువురు నాయకులు ధృవీకరించారు. శరద్ వర్గానికి చెందిన సుమారు ఐదుగురు ఎంపీలు వైరి వర్గం నాయకులతో సంప్రదింపులు సాగిస్తున్నట్లు పార్టీ నాయకుడు, మాజీ మంత్రి ధర్మారావు బాబా ఆత్రమ్ వెల్లడించారు. లోక్‌సభలో ప్రస్తుతం ఎన్‌సీపీ(ఎస్‌పీ)కి 8 మంది ఎంపీలు ఉన్నారు.



మొదటిపేజీ తరువాయి

# అమెరికా-ఇరాన్ 'స్విస్' చర్చలు రద్దు!

## శాశ్వత శాంతి ఒప్పందంపై నీలినీడలు

**న్యూఢిల్లీ, జూన్ 19: హైదరాబాద్ మిర్రర్**



పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించే ఒప్పందం కోసం అమెరికా, ఇరాన్ మధ్య శు క్రవారం జరగవలసిన చర్చలు రద్దయ్యాయి. చర్చలు జరగడం లేదని స్విట్జర్లాండ్ వెల్లడించింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన స్విస్ పర్యటనను రద్దు చేసుకోవడంతో శాశ్వత కాల్పుల విరమణపై అనిశ్చితి మరింత పెరిగింది. ఈ చర్చలకు సంబంధించిన కార్యకలాపాలు ఎప్పుడూ సజావుగా, ఊహించిన విధంగా లేవని వైట్ హౌస్ ప్రతినిధి గురువారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రణాళికలు ఖరారైన వెంటనే స్విట్జర్లాండ్‌కు బయల్దేరడానికి వాన్స్, అమెరికా ప్రతినిధి బృందం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. బర్జెన్‌స్టాక్ మౌంటెన్‌టాప్ రిసార్టులో జరగాల్సిన చర్చలు జరగడం లేదని స్విట్జర్లాండ్ విదేశాంగ మంత్రిత్వశాఖ ధృవీకరించింది. అయితే వివరాలను తెలియచేయలేదు. బుధవారం 14 అంశాలతో కూడిన ఒప్పందంపై అమెరికా, ఇరాన్ సంతకాలు చేసిన అనంతరం శుక్రవారం ప్రారంభం కావలసిన సాంకేతిక చర్చలకు తాము సిద్ధమని ఇదివరకు ప్రకటించిన ఇరాన్ ప్రస్తుత పరిణామాలపై ఇప్పటివరకు స్పందించలేదు.లెబనాన్‌లో కాల్పుల విరమణ..ఇజ్రాయెల్, హెజ్బొల్లా అంగీకారం లెబనాన్‌లో కాల్పుల విరమణకు ఇజ్రాయెల్, హెజ్బొల్లా శుక్రవారం అంగీకరించాయి. పశ్చిమాసియా అంతటా శాశ్వత శాంతి ఒప్పందాన్ని సాధించేందుకు ఉద్దేశించిన విస్తృత దౌత్యపరమైన ప్రయత్నాలను దెబ్బతీసే ప్రమాదం ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. గురువారం రాత్రి లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దళాలు భీకర దాడులు జరపగా డజన్ల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నాయి. హెజ్బొల్లా జరిపిన దాడుల్లో తమ సైనికులు కూడా మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన దరిమిలా ఈ ఘర్షణలు పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు విఘాతం కలిగిస్తాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. కాగా లెబనాన్‌లో స్థానిక కాలమానం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు(13.00 జీఎంటీ) కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్లు అమెరికా సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ దాడులు

## ప్రముఖ హోటళ్లలో కుళ్లిన చికెన్ గుర్తింపు

## పలు రెస్టారెంట్లకు నోటీసులు జారీ

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. హోటల్స్, రెస్టారెంట్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 45 ప్రముఖ ఫుడ్ లే అవుట్లు, 8 పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. మరో రెండు రోజులపాటు ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు కొనసాగనున్నాయి. ఈ దాడుల్లో రెస్టారెంట్లు, హోటల్స్ కిచెన్స్‌లో అధ్వానమైన పరిస్థితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్, మాదాపూర్‌లోని ప్రముఖ రెస్టారెంట్లలో రోజుల తరబడి కుళ్లిన చికెన్, పన్నీర్ ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. దీంతో దాదాపు 20 రెస్టారెంట్లకు అధికారులు పెనాల్టీలు, నోటీసులు జారీ చేశారు. బేగంబజార్, కాటేదాన్ ప్రాంతాల్లో పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేయగా.. అక్కడి వాతావరణం చూసి అధికారులే షాక్‌కు గురయ్యారు. గంజి పొడి, జంతువుల కొవ్వు ఉపయోగించి పన్నీర్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల నేతృత్వంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పాతబస్తీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై హెచ్ ఫాస్ట్ దాడులు నిర్వహించింది. వాడిన ఆయిల్‌ను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అత్యంత ప్రమాదకర రసాయనాలతో సాస్ తయారుచేసి విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. కుళ్లిన కూరగాయలతో సమోసాలు, ప్రమాదకర స్థితిలో ÷-రెడ్ చికెన్ తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫాస్ట్‌ఫుడ్ తయారీ గోదామును పోలీసులు మూసివేశారు.

# జిమ్‌లపై పోలీసుల దాడులు

## శరీరాకృతి కోసం స్టెరాయిడ్స్ వినియోగం

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

నగరంలోని పలు జిమ్‌లపై ఏసీపీ ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిమ్‌లలో వరుసగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. శరీరాకృతి కోసం స్టెరాయిడ్లను విచక్షణారహితంగా వాడటం వల్ల తీవ్రమైన గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైదరాబాద్‌లోని పలు జిమ్‌లలో వరుసగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం కుల్సుంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని జిమ్‌లలో పోలీసుల ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో శరీరాకృతి కోసం యువత యథేచ్ఛగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలు వాడుతున్నట్లు గుర్తించారు. జిమ్‌లలో యువకులను కలిసిన ఏసీపీ.. స్టెరాయిడ్ల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. షార్ట్‌కట్ పద్ధతులను వదిలి, సహజ పద్ధతుల్లోనే ఫిట్‌నెస్ సాధించాలని యువతకు పోలీసులు సూచనలు చేస్తున్నారు.

# నల్లగొండ జిల్లాలో ఘోర ప్రమాదం

## పరస్పరం ఢీకొన్న రెండు కార్లు...

## ముగ్గురు మృతి

## మృతుల్లో తండ్రీ కొడుకులు

**నల్లగొండ,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

నల్లగొండ జిల్లాలోని పెద్దవూర మండలం రామన్నగూడెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రెండు కార్లు పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తండ్రీకొడుకులతో పాటు మరొకరు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన తండ్రీకొడుకులు పల్నాడు జిల్లా ముప్పల్ మండలం కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య(51), ప్రకాష్ రావు (35)గా గుర్తించారు. మరోవ్యక్తి వరంగల్ ఎస్ఎల్‌బీసీ సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సాయికుమార్(20)గా పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురి మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

# సింగరేణిపై బిజెపి చిల్లర రాజకీయాలు

## అక్కడ పర్యటించే హక్కు ఆ నేతలకు లేదు

## ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శలు

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

సింగరేణిపై బీజేపీ ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. సింగరేణి సంస్థపై మాట్లాడే నైతిక అర్హత గానీ, అక్కడ పర్యటించే హక్కు గానీ బీజేపీకి ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ నాయకులు.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని సింగరేణికి వెళ్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ చర్యల ద్వారా బీజేపీ ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉందో స్పష్టంగా అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. సింగరేణి సంస్థను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్రలు పన్నుతున్నాయని అద్దంకి దయాకర్ ఆరోపించారు. పైకి మాత్రం వేర్వేరుగా నటిస్తున్నప్పటికీ.. ఈ రెండు పార్టీలు రాజకీయ మిత్రులని విమర్శించారు. సింగరేణిని చుట్టుముట్టి ఇరు పార్టీలు చేస్తున్నవి కేవలం రాజకీయాలేనని మండిపడ్డారు. దేశంలో బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తున్న విధానంపై, సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై కిషన్ రెడ్డి తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న బీజేపీకి, బొగ్గు నిల్వలపై మాట్లాడే అర్హత ఎక్కడిదని నిలదీశారు.

# కేంద్రానిది అప్పుడూ,ఇప్పుడూ మొండివైఖరే

## కేసిఆర్ రైతులకు అండగా ధాన్యం కొనుగోళ్లు

## 12 వేల కోట్లు ధాన్యం కొనుగోళ్లకు కేటాయించారు- మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి

**నిజామాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**



ధాన్యం కొనుగోళ్లలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించిందని, అయినా ఆనాటి సిఎం కెసిఆర్ ఏనాడూ రైతులకు అన్యాయం చేయలేదని, మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు అండగా నిలిచి ఊరూరా కొనుగోలు కేంద్రాలతో పంటలు కొనుగోలు చేయించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యంలో 3వ వంతు, ఇతర పంటల్లో 25శాతం కొనుగోలు చేయడం ఇప్పుడే అమలుచేసిన కొత్త విధానం కాదు. నాడు బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంబించింది. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోమని అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఒక దశలో అప్పటి సీఎం కేసీఆర్ ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ రైతుల తరఫున పెద్ద పోరాటమే చేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రైతుల పట్ల తన వివక్షను వీడలేదని గుర్తు చేశారు. ఉత్పత్తి అయిన మొత్తం పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని తామూ పోరాడామని అన్నారు. కేంద్రం నిరాకరించినా రాష్ట్రం ముందుకు వచ్చి ధాన్యం సేకించిందని వేముల అన్నారు.కానీ ప్రస్తు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని చెబుతున్నది. ఈ నేపథ్యంలో ఓ వైపు కేంద్రం 25శాతం పంటల్ని మాత్రమే కొనుగోలు చేయడం, మిగిలిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరకంగా మారింది. పంటల కొనుగోళ్లపై ఇటు రాష్ట్రం, అటు కేంద్రం చేతులెత్తేస్తుండటంతో మిగిలిన పంట పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలనే ప్రశ్నలు ఉత్పత్తి అవుతున్నాయి. బహిరంగ మార్కెట్లో విక్రయిద్దామంటే మద్దతు ధర దక్కే పరిస్థితి లేదు. తప్పని పరిస్థితుల్లో విక్రయించిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతువ్యతిరేక చర్యలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తుల విక్రయం దైవాధీనంగా మారిందని అన్నారు. పెట్టుబడి పెట్టి పంటలు పండించిన రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్ర సహాయ నిరాకరణతో రాష్ట్ర రైతుల కోసం నాడు కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కొనుగోలు చేయని పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా, కొనుగోలు చేసినా, చేయకపోయినా రైతులు పండించిన మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు, సోయాబీన్, శనగలు, సన్‌ఫ్లవర్ పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.12వేల కోట్లను ఖర్చు చేసింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో బహిరంగ మార్కెట్లో పంటలు కొనుగోలు చేసే దిక్కులేక రైతులు విలవిల్లాడిపోతే రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అన్ని పంటలను మొత్తం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ పార్టీ చేసిన రాద్ధాంతం అంతాఇంతా కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయకపోతే రాష్ట్రం ప్రభుత్వం ఏం చేస్తుందని, రైతుల పంటలు కొనుగోలు చేసేందుకు కూడా పైసలు లేవా? అంటూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన విషయం గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి పంటనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, అంతేకాదు.. మద్దతు ధరకు అదనంగా బోనస్ కూడా చెల్లిస్తామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలోనే పంటల కొనుగోళ్లపై చేతులెత్తేసిందని మండిపడ్డారు. నాడు పదేండ్ల పాటు రైతులకు ఇబ్బందుల్లేకుండా కేసీఆర్ పంటలు కొనుగోలు చేస్తే.. ఇప్పుడు రేవంత్ సర్కార్ రెండున్నరేండ్లకే తమ వల్ల కాదని చేతులెత్తేసిందని అన్నారు. ఉత్పత్తి చేసిన మొత్తం పంటలను కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# ఏడు రకాలే సాగు చేయాలన్న ఆంక్షలు సరికాదు

## రైతులకు అండగా ప్రభుత్వం నిలబడాలి

## మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

**మహబూబ్‌నగర్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇప్పటికే సాగులో ముందుకు సాగలేక ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం కేవలం 7 సన్నరకాల పంటలనే సాగు చేయాలని ఆంక్షలు పెట్టడం సరికాదని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి హితవు పలికారు. దిగుబడి లేని పంటలను సాగు చేయాలంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం సూచించే ఆ ఏడు రకాల పంటలకు చీడపురుగుల సమస్య కూడా అధికంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నాడిక్కడ మాట్లాడుతూ గతంలో 33 సన్న రకాలను గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్.. ఇప్పుడు ఏడింటికే కుదించడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు ఏ రకమైన పంట సాగుచేసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకాన్ని, భరోసాను రైతులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఖరీఫ్‌లోనైనా రైతు భరోసా రూ.15,000 చొప్పున వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం బోనస్ ఇవ్వడాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందని విమర్శించారు. రైతు బీమా ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుల కుటుంబ సభ్యులు చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 'యూరియా సామా న్యులకు ఏమి అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈసారైనా రైతులు యూరియా కోసం పడికాపులు కాయకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోతే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధాన్యం పోసి ధర్నా చేస్తానన్న రేవంత్.. ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రకటనలు గుప్పిస్తున్నదే తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు దకిందేమీ లేదని తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను రైతులు అడ్డికి పావుసేరు చొప్పున అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం సేకరణ బాధ్యతల నుంచి తప్పించుకొనేందుకే కుంటిసాకులు వెతుకుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# అనుమానం.. పెను భూతమై

## పసికందును బలి తీసుకున్న తండ్రి

## భార్యపై అనుమానంతో చిన్నారి హత్య

**నిజామాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

నిజామాబాద్ పట్టణంలో దారుణ ఘటన వెలుగు చూసింది. రెండు నెలల చిన్నారిని కన్నతండ్రే అత్యంత దారుణంగా నరికి చంపడం కలకలం రేపింది. భార్యపై అనుమానంతో పిల్లాడు తనకు పుట్టలేదన్న అనుమానంతో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడటం కలకలం రేపుతోంది. మహారాష్ట్రలోని నయాగావ్‌కు చెందిన యువరాజ్, నిజామాబాద్‌లోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ప్రియాంక ఏడాది కిందట వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలపాటు వారి బంధం అన్యోన్యంగా సాగింది. ఆ తర్వాత ప్రియాంకపై యువరాజ్ అనుమానం పెంచుకోవడం ప్రారంభించాడు. ప్రియాంకను అనుమానిస్తూ ప్రతిరోజూ వేధించడం మొదలుపెట్టాడు. మరోవైపు ఆమె గర్భం దాల్చడంతో వేధింపులు మరింత పెరిగాయి. ఇటీవల పుట్టింటికి వచ్చిన బాధిత తల్లి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, చిన్నారి తనకు పుట్టలేదంటూ ప్రియాంక కుటుంబ సభ్యులతో పలుమార్లు యువరాజ్ గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలోనే జూన్ 17న బుధవారం చిన్నారిని ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. అనంతరం నిర్మానుష్య ప్రదేశంలో బాలుడిని కత్తితో పలుమార్లు నరికి హత్య చేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని రైల్వే పట్టాల పక్కన పడేసి పరారయ్యాడు. సాయంత్రం అయినా భర్త, కుమారుడు ఇంటికి రాకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి మృతితో ప్రియాంక, ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాం నింపింది. యువరాజ్ కిరాతక చర్యపై పట్టణవాసులు తీవ్రంగా నిరసించారు. కఠినంగా శిక్షించాలని కోరారు.

# గండిపేట భూకబ్జా కేసు

## షరతులతో బ్రహ్మానాయుడికి బెయిల్

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి బెయిల్ మంజూరు అయ్యింది. ఆయనకు రంగారెడ్డి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. రూ.20 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని రంగారెడ్డి న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను, విచారణను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించవద్దని షరతుల్లో పేర్కొంది. ఫేక్ జీవో కేసులో ఇప్పటికే ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు బొల్లా బ్రహ్మానాయుడిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన తర్వాత ఆయనను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ బొల్లా బ్రహ్మానాయుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగిసిన అనంతరం మాజీ ఎమ్మెల్యేకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, కస్టడీలో మాజీ ఎమ్మెల్యే సరైన సమాధానాలు చెప్పలేదని, ఏ ప్రశ్నలు అడిగా తనకు తెలీదని మాత్రమే చెప్పారని, తాము ఆశించిన స్థాయిలో విచారణకు సహకరించలేదంటూ న్యాయస్థానం దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. కస్టడీ పూర్తి అయినందుకు బెయిల్ పొందేందుకు అర్హుడే అంటూ బొల్లా బ్రహ్మానాయుడు తరఫు న్యాయవాదులు వాదించారు. దీంతో మాజీ ఎమ్మెల్యేకు రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

# క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించండి

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలి

## సెప్టెంబరు నాటికల్లా మొదటి విడత ఇండ్ల నిర్మాణాలు పూర్తి

## హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి. పి. గౌతం

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై ప్రాజెక్టు డైరక్టర్లు, ఎఇ లతో సమీక్ష

**హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి జిల్లాల ప్రాజెక్టు డైరక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం సూచించారు. అంతే కాకుండా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో గ్రామ సమాఖ్యలతో సమన్వయం చేసుకోవాలని పూర్తి పారదర్శకంగా వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లాల ప్రాజెక్టు డైరక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, ఎఇలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబరు నాటికల్లా మొదటి విడతలో మంజూరైన ఇండ్లన్నీ పూర్తి అయ్యేలా, పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నిర్దేశించినట్లుగా మరో లక్ష ఇండ్ల గృహ ప్రవేశాలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఎఇలు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ, లబ్ధిదారులు ఇండ్ల పనులను వేగవంతంగా పూర్తి చేసుకునేలా చైతన్య పరచాలని ఎండి గౌతం ఆదేశించారు. వారు ఇంటి నిర్మాణాల కోసం అధిక మొత్తంలో ఖర్చు పెట్టి ఇబ్బందులు పడకుండా వారికి అవగాహన కల్పించాలని ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. లాగే వివిధ ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూం కాలనీల్లోని మౌలిక వసతుల కల్పన పనులను, వాటి కేటాయింపు పక్రియపై సమీక్షిస్తూ, ఆయా కాలనీల్లోనే గృహ నిర్మాణ శాఖ ఎఇల కార్యాలయాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్టాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు, గ్రామాల్లో గుడిసెల్లో నివస్తున్న వారి వివరాలను సమగ్రంగా సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, జనరల్ మేనేజర్లు మమత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# అక్షర జ్ఞానంతో ఉన్నత శిఖరాలకు చేరవచ్చు

**కొత్తగూడెం,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

ప్రతి విద్యార్థి అక్షర జ్ఞానంతో అనుకున్న లక్ష్యాన్ని అధిగమించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ సర్పంచ్ తాటి వాణి అన్నారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను ఉప సర్పంచ్ భూక్యా మోహన్‌రావుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత స్థాయిలో చూడాలని అనుకుంటారని, అందుకు తగినట్లుగా ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

# కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

**కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక విశ్వాస ఘాతక ప్రభుత్వం**
**రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ**
**రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి**
**రెండు బస్తాల యూరియాతో మిర్చి రైతులు ఏం కాను**
**మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు**

సిద్దిపేట,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024-25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు .ల్గ÷తుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా అని మంత్రులకు ఆయన సవాల్ విసిరారు.మొత్తం రాష్ట్రంలో 7,600 మందికి బీమా రాలేదని గణాంకాలతో సహా హరీశ్‌రావు వివరించారు. ఎందుకు భీమా రావడం లేదంటే.. ప్రభుత్వం ప్రీమియం కట్టలేదన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్ రావు డిమాండ్ చేశారు.



# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

**మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి**
**కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు**
**మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు**

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):



రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకు రావడానికి ప్రజలంతా కథా నాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ మరోసారి వన్‌వే

## ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించనున్న పోలీసులు

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

నగరవాసులకు ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ జారీ చేశారు. ఆదివారం కేబీఆర్ పార్క్ చుట్టూ మరోసారి వన్‌వే ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్ వివరాలు వెల్లడించారు. ట్రయల్ రన్ విజయవంతమైతే వారం తర్వాత వన్‌వేను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. పార్క్ చుట్టూ ఏడు ÷÷-లఓల్గ÷వర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయని, పనులు జరిగే రోజుల్లో వన్‌వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు జాయింట్ సీపీ చెప్పారు. గతంలో ఒకసారి ట్రయల్ రన్ నిర్వహించామని, ఈ సందర్భంగా పలు జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులను గుర్తించామని జోయల్ డెవిస్ తెలిపారు. 45 జంక్షన్ వద్ద పీక్ అవర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు. అలాగే డ్రోన్ విజువల్స్‌ను పరిశీలించామని, ప్రయాణికులు, నిపుణుల అభిప్రాయాలను తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మరోసారి ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ట్రయల్ రన్ ఉంటుందని వెల్లడించారు. ఈ ట్రయల్ రన్‌లో 150 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు చెప్పుకొచ్చారు. నగరవాసులు ట్రాఫిక్ అలర్ట్‌ను గమనించాలని జోయల్ డెవిస్ పేర్కొన్నారు. ÷ూగా, నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ÷÷-లఓల్గ÷వర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణాలను చేపట్టింది. ఇవి పూర్తయితే నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరే అవకాశం ఉంటుంది.

# వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం

**18 లక్షల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం**
**విద్యాశాఖ, మీసేవ నేతృత్వంలో వినూత్న కార్యక్రమం**
**డిజిటల్ మస్కట్ గా పాలపిట్టతో సమాచార వ్యాప్తి**

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

డిజిటల్ పాలనలో తెలంగాణ ప్రజాప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలల సమాచారం ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులకు అందించనున్నారు. మీసేవ సహకారంతో వాట్సాప్ ద్వారా ఇకపై స్కూల్ అప్డేట్స్ నేరుగా వారి ఫోన్ కు చేరనున్నాయి. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను నేరుగా వాట్సాప్ ద్వారా పొందనున్నారు. విద్యా పురోగతి, పరీక్షల సమాచారం, విద్యా సామగ్రి పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, పాఠశాల కార్యక్రమాలు, ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల వంటి అంశాలపై సకాలంలో సమాచారం అందుబాటులోకి రానుంది. ప్లాట్‌ఫారమ్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ / కమ్యూనికేషన్స్ (ఎ÷ఇ/అ) శాఖకు చెందిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ–మీసేవ విభాగం, పాఠశాల విద్యా శాఖతో కలిసి అభివృద్ధి చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు పారదర్శకంగా, సులభమైన రీతిలో వేగవంతమైన సేవలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఈ డిజిటల్ సేవలను వినియోగించు కుంటున్నారు. వాట్సాప్ ద్వారా మీసేవ ప్రస్తుతం అందిస్తున్న ప్రధాన సేవలు ఇలా ఉన్నాయి. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు,హాల్ టికెట్ల డౌన్‌లోడ్,మార్కుల మెమోలు,పరీక్షా ఫలితాలు,ఎస్ఎస్‌సీ మెమోలు, బోనెడ్ సర్టిఫికెట్లు,ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్లు,ఎస్ఎస్‌సీ మెమో సవరణల దరఖాస్తులు సేవల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, సమయంతో పాటు వ్యయం ఆదా అవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్న సేవలు తదుపరి దశలో క్రింది సేవలను కూడా వాట్సాప్ వేదికలో అందుబాటులోకి తీసుకురానున్నారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలు,విద్యార్థుల హాజరు సమాచారం,ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు,మధ్యాహ్న భోజన పథకం వివరాలు,ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలు,క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాల సమాచారం, రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ కార్యక్రమాల వివరాలు,విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'ను డిజిటల్ మస్కట్‌గా పరిచయం చేశారు. పాలపిట్ట యానిమేషన్ వీడియోల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన సమాచారం, అవగాహన సందేశాలు, వీడియోలు వాట్సాప్‌లో పంపించబడతాయి. దీనివల్ల ప్రభుత్వ విద్యా సమాచార ప్రసారం మరింత సులభంగా, ఆకర్షణీయంగా, ప్రజలకు చేరువ అవుతుంది. సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యా రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం, తల్లిదండ్రులతో ప్రభుత్వ అనుసంధానాన్ని బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు చేరువైన, సమర్థవంతమైన డిజిటల్ సేవల అందింపులో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. వాట్సాప్ ఆధారిత పాఠశాల విద్యా సేవల ప్రారంభం తెలంగాణ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

## విచారణకు హాజరైన చీకోటి ప్రవీణ్

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ విచారణ ముగిసింది. దాదాపు గంటన్నరపాటు ప్రవీణ్‌ను సిట్ అధికారులు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సిట్ కార్యాలయంలో ఆయనను అధికారులు విచారించారు. విచారణకు ముందు సిట్ కార్యాలయం ఎదురుగా ఉన్న అమ్మవారి దేవాలయంలో దర్శనం చేసుకున్నారు చికోటి ప్రవీణ్. సిట్ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. 'ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. మా ఫోన్లు ట్యాప్ చేసి వ్యక్తిగత విషయాలను విన్నారు. ఊహించిన దానికన్నా ఘోరంగా ఫోన్ల ట్యాపింగ్ జరిగినట్లు విచారణలో నాకు అర్థమైంది. నేను 200మంది ఫోన్లు మాత్రమే ట్యాప్ అయ్యాయని అనుకున్నా. కానీ ఆ జాబితా రెండు వేలకు పైగా ఉంది. నాకు దగ్గరిగా ఉన్న వారి ఫోన్లనూ విన్నారు. విచిత్రం ఏమిటంటే, ఎక్కువగా బీఆర్ఎస్ నాయకులకు సంబంధించిన ఫోన్లనే ట్యాప్ అయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భార్యలు, పనిమనుషులకు సంబంధించిన ఫోన్లను ట్యాప్ చేశారు. రాధా కిషన్ రావు ఎవరో తెలియదని కేసీఆర్ అన్నారు. ఆయన నియామకానికి సంబంధించిన జీవో తెచ్చింది కేసీఆర్ కాదా?. ఇలాంటి నీచమైన రాజకీయాలు ప్రపంచంలో బీఆర్ఎస్ తప్ప ఎవరూ చేయరు. ఇది ముమ్మాటికీ కేసీఆర్, కేటీఆర్ చేయించిన ట్యాపింగే. రాధా కిషన్ రావు ఆస్తులపై విచారణ చేయించాలి. లేదంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖలు రాస్తాం. ఫోన్ ట్యాపింగ్ కేసును సీఎం రేవంత్ రెడ్డి పారదర్శకంగా విచారణ చేయించాలి. నాపై ఈడీ దాడులు జరగడానికి ముందే నా ఫోన్ సంభాషణలు విన్నారు. ఈ కేసు నిందితులకు నార్కో అనాలిసిస్ పరీక్ష నిర్వహిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయి' అని తెలిపారు. కాగా, బీఆర్ఎస్ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు తెలంగాణ డీజీపీకి చికోటి ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావు ట్యాపింగ్ చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణలో చికోటి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించిన సిట్ అధికారులు నేడు విచారణకు పిలిచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

# ఫాల్కన్ ఇన్వాయిస్ కేసులో కీలక పరిణామం

## మరో నిందితుడిని అరెస్ట్ చేసిన తెలంగాణ సిఐడి

హైదరాబాద్,జూన్19( హైదరాబాద్ మిర్రర్):

ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ స్కామ్ కేసులో మరో కీలక నిందితుడిని తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ముంబైకి చెందిన వరల్డ్‌లైన్ ఈ–పేమెంట్ గేట్‌వే ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మొహిదీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడిన కేసులో అతడిని అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఫాల్కన్ గ్రూప్ ఎండీ అమర్‌దీప్ కుమార్‌తో పాటు పలువురు కీలక నిందితులు అరెస్టయ్యారు. తాజాగా ముంబైకి చెందిన ఈ కీలక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ అప్లికేషన్, వెబ్‌సైట్ ద్వారా దేశవ్యాప్తంగా 7,056 మంది నుంచి పెట్టుబడుల రూపంలో నగదు సేకరించినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అధిక లాభాల ఆశ చూపి డిపాజిటర్ల నుంచి ఏకంగా రూ.4,215 కోట్లు తీసుకున్నట్లు తేల్చారు. వీరిలో 4,065 మందిని క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా రూ.792 కోట్ల మేర మోసం చేసినట్లు తెలిపారు. కాగా, అమర్‌దీప్ కుమార్‌తో షేక్ మొహిదీన్ కుమ్మక్కై పేమెంట్ గేట్‌వే సేవల ద్వారా డిపాజిట్లు సేకరించేందుకు సహకరించినట్లు సీఐడీ అధికారులు తేల్చారు. దీంతో ఈ కంపెనీతో సుమారు రూ.7.5 కోట్ల లావాదేవీలు జరిగినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు నిందితుడు షేక్ మొహిదీన్‌ను అరెస్టు చేసిన సీఐడీ అధికారులు రిమాండ్‌కు తరలించారు.

# మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

## కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం

## కర్ణాటక తీరుకు నిరసనగా తమిళ అసెంబ్లీలో తీర్మానం

**చెన్నై,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**



కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరులకు శాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతో పాటు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు సహా ప్రాజెక్టుకు సంబంధించిన ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి కాంగ్రెస్, వీసీకే, ఇతర పార్టీలు మద్దతు తెలిపాయి.

# దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

## పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు

**న్యూఢిల్లీ,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

# పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

## వాట్సాప్ ద్వారా సమాచారం తెలుసుకునే వీలు

## నీట్ విద్యార్థులకు ఎన్‌టిఎ కీలక సమాచారం

**న్యూఢిల్లీ,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్ఎమ్ఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

# పర్యావరణ పరిరక్షణతో ప్రజలకు ఆరోగ్యం

## భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

**కొత్తగూడెం,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

పర్యావరణం పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటే మానవాళికి ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండలంలోని మండల పరిషత్, ఫారెస్ట్, ఐటీసీ, ఈజీఎస్ అధికారులు, సర్పంచ్ తో తన ఛాంబర్‌లో వన మహోత్సవంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పారిశ్రామిక వాడగా పిలుస్తున్న సారపాక పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా ఏడాదికి 25 వేల మొక్కల చొప్పున నాలుగేళ్లకు లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకోవాలని, ఇందుకు అన్నిశాఖల అధికారులు కృషి చేయాలన్నారు. సారపాకలో ఖాళీ ప్రదేశాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షించే బాధ్యత తీసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అటవీ శాఖతో పాటు ఐటీసీ పీఎస్పీడీ, ఈజీఎస్ శాఖల అధికారులు పంచాయతీకి మొక్కలను అందించి ఈ లక్ష్యాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయాలన్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని సారపాక పంచాయితీయే కాకుండా గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో ప్రాణ వాయువును ప్రసాదించే మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించినప్పుడే మానవాళికి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయని, దీంతో ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవన్నారు. పారిశ్రామిక ప్రాంతాలతో పాటు గ్రామాలు పచ్చదనంతో కళకళలాడాలని దీనికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఫారెస్ట్ డీఆర్ఓ దారావత్ కృష్ణ, ఐటీడీఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, ఐటీసీ డిప్యూటీ జీఎం విశ్వనాథం, ఈజీఎస్ ఏపీఓ విజయలక్ష్మి, సర్పంచ్ గుగులోత్ కిషోర్‌నాయక్, బీట్ ఆఫీసర్ భీమ్చంద్ పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్‌దే అధికారం

## కెసిఆర్ సిఎం కావడం ఖాయం - మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్

**నారాయణపేట,జూన్19( హైదరాబాద్ మిర్రర్):**

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖామమని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కొడంగల్ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు , సర్‌పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, కొప్పుల మహేష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జెండాను మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ఎగురవేసి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల సవరణ జాబితా తయారి కార్యక్రమంలో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త భాగస్వాములు కావాలని సూచించారు . దేశంలో అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీలలో బీఆర్ఎస్ ఒకటిగా నిలిచిందని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మించారని గుర్తుచేశారు.భూమి ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు కార్యకర్తల సంక్షేమం, గౌరవం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్ల పెంపు, బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలు, గొల్ల కురుమల అభివృద్ధి పథకాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. రైతులు, మహిళలు, బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వం



సమర్ధవంతంగా పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలన్నారు. స్వంత జిల్లాకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలపై వేధింపులు, అక్రమ కేసులను ఆపి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## - నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ

## - యువతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది రాహుల్ మాత్రమే

చౌడాపూర్ మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్,మాట్లాడుతూ... దేశ యువతకు ఉపాధి, అవకాశాల కల్పనే రాహుల్ గాంధీ ప్రధాన లక్ష్యమని అన్నారు. యువతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ దేశంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడని ఆయన అన్నారు. ఉద్యోగ నియామక పరీక్షలలో తరచూ జరుగుతున్న పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది యువత తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఉద్యోగాలు రావాలంటే విధానాల్లో మార్పు రావాలి" అని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా సామాజిక



న్యాయం, సమాన అవకాశాలు, యువత సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చే భారతదేశ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. భగవంతుని ఆశీర్వాదంతో రాహుల్ గాంధీ మరింత ప్రజాసేవ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.సాధారణ ప్రజలు, రైతులు, యువత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీకి దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని కోరుతూ పార్టీ శ్రేణులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

## ఎస్ ఐ ఆర్ అవగాహన సమావేశం

**కొడంగల్, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి, జూన్,19,2026,**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కొడంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు మరియు ఎస్ ఐ ఆర్ అవగాహన సమావేశంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్ ఐ ఆర్ అంశంపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.







# టి.ఆర్.పి జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ గౌస్ పాషా నియామకం

**వికారాబాద్, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి, జూన్,19,2026,**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా మహమ్మద్ గౌస్ పాషాను వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి బండారపు నరసయ్య గౌడ్, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహమ్మద్ గౌస్ పాషాకు వికారాబాద్ జిల్లా అధ్యక్ష బాధ్యతలతో పాటు పరిగి నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలను కూడా అప్పగించారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, రాష్ట్రంలో మైనారిటీలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మైనారిటీల హక్కుల సాధనలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, వారికి సముచిత స్థానం కల్పించడమే పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం మహమ్మద్ గౌస్ పాషా మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు మున్నూరు జైపాల్ రెడ్డి, స్టేట్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# అక్రమంగా పుస్తకాల విక్రయం చేస్తున్న కృష్ణవేణి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ....

**వికారాబాద్, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి, జూన్,19,2026,**

స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థ కృష్ణవేణి స్కూల్ నిర్వహిస్తున్న అక్రమ పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టి, పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.వికారాబాద్ పట్టణంలో కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ గదిని అద్దెకు తీసుకుని పుస్తకాలను విక్రయిస్తోందని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడ అక్రమంగా విక్రయిస్తున్న పుస్తకాలను మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ, పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతోందని మండిపడ్డారు. ఒక్క నర్సరీ విద్యార్థి నుంచే పుస్తకాల పేరుతో రూ.2,070 వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బాలకృష్ణ మూవీలో కాజల్ అగర్వాల్

### ఫస్ట్ లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్




నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శు క్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'ఎన్‌బికె111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.

## సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి

అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి.ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణా సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# పవర్‌ఫుల్ రోల్‌లో సమంత

## లేడీ ఓరియంటెడ్ మూవీ..మాఇంటి బంగారం





మూడేళ్ల విరామం తర్వాత సమంత చేసిన సినిమా 'మా ఇంటి బంగారం'. దాంతో ఈ సినిమాపై అంచనాలు మొదట్నుంచీ భారీగానే ఉన్నాయి. పైగా 'ఓ బేబీ' తర్వాత నందినీరెడ్డి, సమంత కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినిమాపై ఆసక్తి జనాల్లో మెండుగానే ఉన్నది. ఈ సినిమాలో సమంత తొలిసారి యాక్షన్ రోల్ పోషించారు. ప్రచార చిత్రాలకూ, పాటలకు కూడా మంచి స్పందన రావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ వివాహం చేసుకొని, ఓ సంప్రదాయ కుటుంబంలోకి పెద్ద కోడలుగా ఎంట్రీ ఇస్తుంది స్వర్ణ(సమంత). ఇంట్లోకి వచ్చిన నాటి నుంచి అప్పటికే ఇంట్లో ఉన్న చిన్నకోడలు అనసూయ(శ్రీముఖి)తో పోలుస్తూ అంతా ఆమెను చూస్తుంటారు. అనసూయ ఇంటిని చక్కదిద్దటంలో దిట్ట. కానీ స్వర్ణకు మాత్రం ఆ ఇంటి విషయాలు ఏమీ తెలియవు. కానీ ఎలాగైనా పెద్ద కోడలుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెడుతుంది. దీనికి తన చిన్ననాటి స్నేహితురాలు ఆమెకు సహాయం చేస్తుంటుంది. ఈ విధంగా సరదాగా కథ సాగుతూవుంటుంది. మరోవైపు నక్సలైట్ ముసుగులో దుర్మార్గాలకు తెగబడే నీచుడైన గుల్షన్ దేవయ్య జైల్లో శిక్ష అనుభవిస్తుంటాడు. తనకు అనుచరుడి ద్వారా తన సహ నక్సలైట్ అయిన ఝూన్సీ ఆచూకీ తెలుస్తుంది. ఆ ఝూన్సీనే స్వర్ణగా పేరు మార్చుకొని బతుకుతున్నదని తెలుసుకున్న గుల్షన్ దేవయ్య, ఎలాగైనా ఝూన్సీని దక్కించుకునేందుకు జైలు నుంచి పారిపోయి వస్తాడు. ఝూన్సీ వేరే వ్యక్తిని పెళ్లాడిందని తెలుసుకొని రగిలిపోతాడు. ఎలాగైనా ఝూన్సీని, ఆమె కుటుంబాన్నీ నాశనం చేయాలనుకుంటాడు. మరి స్వర్ణ రూపంలో ఉన్న ఝూన్సీ తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నది? అసలు స్వర్ణలా ఝూన్సీ ఎందుకు మారింది? ఈ స్వర్ణ ఎవరు? ఆమె కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. కొంచెం రొటీన్ కథే అయినా 'మా ఇంటి బంగారం' విషయంలో కొత్తగా కనిపించిన విషయం ఏంటంటే.. ఇది లేడీ ఓరియెంటెడ్ స్జబెక్ట్ కావడమే. ఈ తరహా కథ ఓ హీరోయిన్ చేయడం మాత్రం కొత్తగా ఉన్నది. ఫస్టాఫ్ సినిమా చూస్తున్నంతసేపూ మహేశ్‌బాబు 'అతడు' సినిమా గుర్తొస్తుంది. అందులో మహేశ్ కిరాయి హంతకుడు. ఇందులో సమంత నక్సలైట్. అంతే తేడా. కథ పాతదైనా దాన్ని కొత్తగా చెబితే సినిమా హిట్టే. ఈ విషయంలో దర్శకురాలు నందినిరెడ్డి సక్సెస్ అయ్యిందనే చెప్పాలి. ప్రథమార్ధంతో సమంతను కుటుంబ స్త్రీగా చూపించిన తీరు, అక్కడ్నుంచీ నిదానంగా ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్.. సమంతతో చేయించిన పోరాటాలు, ఈ నేపథ్యంలో వచ్చే ఉత్కంఠభరితమైన సన్నివేశాలు మాస్ ఆడియన్స్‌కి బాగా పట్టేస్తాయి. ఫస్టహాఫ్‌లో ఇంట్లో జరిగే కామెడీ సన్నివేశాలు, కారు ఛేజింగ్ సీక్వెన్స్ చాలా బావున్నాయి. ఇక సెకండాఫ్‌లో కథ కాస్త స్లో అయినట్టు అనిపిస్తుంది. తనెవరో తన ఇంట్లో అందరికీ రివీల్ చేసే క్రమంలో కాస్త కథ నిదానించిన ఫీలింగ్ కలుగుతుంది. హీరోలకు ఏ మాత్రం తీసిపోకుండా అద్భుతమైన పోరాటలు చేసి శభాష్ అనిపించుకున్నది సమంత. ఈ సినిమాలో ఝూన్సీగా, స్వర్ణగా రెండు షేడ్స్‌ని అద్భుతంగా పోషించింది. తనదైన శైలిలో కామెడీ కూడా పండించింది. 'స్త్రీ అంటే ఇలా ఉండాలి..' అనిపించేలా ఆమె పాత్ర సాగింది. సమంత తర్వాత ఈ సినిమాలో చెప్పుకోవాల్సిన పాత్ర గుల్షన్ దేవయ్యదే. తన విలనీ అదిరిపోయింది. చెడ్డ లక్షణాలున్న నక్సలైట్ నాయకుడిగా తను ఒదిగిపోయి అభినయించాడు. ఇక మిగతా వారంతా కూడా పరిధిమేర తమ పాత్రలను రక్తికట్టించారు. రాజ్ నిడిమోరు పాత కథే రాసినా.. డైరెక్టర్ నందినీరెడ్డి కొత్త ట్రీట్ చేసి, జనరంజకంగా సినిమాను తెరకెక్కించింది. సెకండాఫ్ విషయంలో కాస్తంత శ్రద్ధ పెడితే బావుండేది. సంతోష్ నారాయణ సంగీతం సినిమాకు పెద్ద ఎస్సెట్. నేపథ్య సంగీతం బావుంది. ఓం ప్రకాశ్ కెమెరా పనితనం అభినందనీయంగా ఉంది. మొత్తంగా లేడీ ప్రేక్షకులు, సమంత అభిమానులు గర్వపడేలా, మాస్ ప్రేక్షకులకు నచ్చేలా, ఫ్యామిలీ ఆడియన్స్ మెచ్చేలా సినిమా ఉన్నదని చెప్పొచ్చు.



## తెలంగాణ ఫోక్ సింగర్ నాగదుర్గకు హీరోయిన్ ఛాన్స్

'కాపోళ్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొొతుండు' వంటి విలక్షణమైన జానపద గీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది.తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.



## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు

### 22న విచారణకు రావాలని అల్లు అర్జున్‌కు సమన్లు

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో టాలీవుడ్ సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. జూన్ 22న సోమవారం వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చిక్కడపల్లి పోలీసులు చేర్చారు. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని 1 నుంచి 10వ నిందితులుగా పేర్కొన్నారు. మొత్తం 19 మందికి కోర్టు సమన్లు జారీ చేయగా, 23 మందిపై ఇప్పటికే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న సంధ్య థియేటర్‌లో 'పుష్ప 2' ప్రీమియర్ సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అయితే ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ లీగల్ టీమ్ స్పందిస్తూ, సోమవారం జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ విషయంపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తాం అని తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన వివిధ వ్యక్తులు, సంస్థల పాత్రలు, బాధ్యతలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోమవారం జరగనున్న విచారణ ఈ కేసులో కీలక పరిణామంగా మారనుంది.

## ధనుష్ తాజా చిత్రం ఓం



తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. డి 55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి 'ఓం అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా 'అణ్ణా మలైయార్‌కు!' అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ఓం'పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రయిక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889